

సీసీ రోడ్డుకు భూమి పూజ

ప్రజాశక్తి -గుడిపల్లి: మండలంలోని కంచిబందార్లపల్లి గ్రామంలో సిసి రోడ్డు పనులకు గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ భూమిపూజ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో రోడ్డులేని గ్రామం ఉండకూడదనే ఉద్దేశ్యంతో ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, తారు రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. టిడిపి మండలాధ్యక్షులు సుబ్రమణ్యం, మార్కెట్ కమిటీ ఛైర్మన్ జిఎం.రాజు, టిటిడి బోర్డు మెంబర్ శాంతారం, క్లస్టర్ ఇన్‌చార్జి బేటప్ప నాయుడు, బాలాజీ, అరుణాచలం, యల్లప్ప, ఉదయ్, భానుమూర్తి, సురేష్ పాల్గొన్నారు.


సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ

స్మార్ట్ కుట్ర..

- తెల్లరేషన్ కార్డులకు మంగళం..
- పంపిణీకి నోచుకొని కార్డులు
- అనర్హులుగా ఏరివేత

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

స్మార్ట్ పేరిట తెల్లరేషన్ కార్డులకు మంగళం పాడింది రాష్ట్ర ప్రభుత్వం.. గతంలో ఉన్న తెల్లరేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు అందజేసింది. కార్డుదారులు ఎక్కడైనా బియ్యం, ఇతర నిత్యావసరాలు పొందవచ్చంటూ స్మార్ట్‌గా రేషన్‌కార్డులకు ఏరివేతను స్టార్ట్ చేసింది. ప్రజల నుండీ బయోమెట్రిక్ తీసుకొవడం వల్ల దూరప్రాంతాల్లో ఉండేవారిని తొలగించేందుకు ఓ స్మార్ట్ కుట్ర చేసింది. దీని వలన రేషన్ కార్డుదారుల సంఖ్యను తగ్గించింది. దీని వలన చాలా వరకు కార్డుదారుల సంఖ్య తగ్గిపోగా ప్రస్తుతం స్మార్ట్‌కార్డులు పొందని వారిని సైతం అనర్హులుగా గుర్తించి తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చూస్తోంది.

సెప్టెంబర్ నెలలో ప్రభుత్వం స్మార్ట్‌కార్డులను తీసుకొచ్చింది. సచివాలయాలు, రేషన్‌షాపు డీలర్లకు పంపిణీ బాధ్యత అప్పగించింది. ఈ స్మార్ట్‌కార్డుల పంపిణీకి గత నెల వరకు గడువు విధించింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు కార్డులు పంపిణీ చేసింది. కార్డులు పొందని వారిని అనర్హులుగా గుర్తించి తొలగించనున్నారు. ఈ మేరకు జిల్లాలో పంపిణీకాని స్మార్ట్‌కార్డుల వివరాలను రేషన్‌డీలర్, సచివాలయ సిబ్బంది ద్వారా సేకరించడంతో పాటు తిరిగి ఆయా జిల్లాల పౌరసరఫరా కార్యాలయాలకు అప్పగించాలనే ఆదేశాలు జారీ చేసింది. స్మార్ట్‌కార్డులు తీసుకునేందుకు బయోమెట్రిక్ వేయాలనే విషయం, వాటని పొందాలనే విషయాలు తెలియ అనేక మంది లబ్ధిదారులు ఆందోళనకు గురైతున్నారు. ఇందుకు సాక్ష్యం గ్రామీణ ప్రాంతాల్లో 4,009 స్మార్ట కార్డులు పంపిణీ నోచుకోకపోవడమే..



విజయపురం మండలంలో 381 స్మార్ట్‌కార్డులు పంపిణీ కాలేదు. మిగిలిన మండలాల విషయానికి వస్తే చిత్తూరు 400, బంగారుపాళ్యం 1,363, జీడి నెల్లూరు 1,849, గుడిపాల 714, ఐరాల 1,154, పాలసముద్రం 590, పెనుమూరు 1,538, పులిచర్ల 713, రొంపిచర్ల 415, ఎస్‌ఆర్‌పురం 739, తవణంపల్లి 751, వెదురుకుప్పం 1,241, విజయపురం 318, యాదమరి 615, నగరి 866, నింద్ర 456 ఉన్నాయి. వీటితో పాటు నగర, పట్టణ ప్రాంతాల్లో కూడా పంపిణీకి నోచుకొని స్మార్ట్‌కార్డులు వంద సంఖ్యలోనే ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలోని 2,901 చౌకదుకాణాల ద్వారా 11,48,646 తెల్లరేషన్ కార్డుదారులకు ప్రత్యామ్నాయంగా కూటమి ప్రభుత్వం స్మార్ట్ కార్డులను తీసుకొచ్చింది. జిల్లాలోని చౌకదుకాణాల్లో లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసుకొని కూటమి ప్రభుత్వ లోగోతో గతంలో ఉన్న తెల్లరేషన్‌కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్‌కార్డులను ప్రజలకు రేషన్‌డీలర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా అందించారు. వివిధ కారణాలతో కొందరికి స్మార్ట్‌కార్డులు అందలేదు. ప్రభుత్వం నూతనంగా ఇచ్చిన స్మార్ట్‌కార్డుల కోసం కార్డులోని లబ్ధిదారుల ఆధార్ కార్డులు ఇవ్వాలని రేషన్‌షాపు డీలర్లు, సచివాలయ సిబ్బంది ఆంక్షలతో అనేక మంది స్మార్ట్‌కార్డులు పొందలేకపోయారు. పూరిస్తాయిలో స్మార్‌కార్డులు పంపిణీ కాకపోవడానికి ఇదో కారణం. మరోవైపు అర్హులైన లబ్ధిదారులు బయోమెట్రిక్ తప్పనిసరి చేయడంతో బయోమెట్రిక్‌లో వేలిముద్ర వేయని వారి పేర్లకు తొలగించారు. స్మార్ట్ కార్డులు తీసుకుంటే బయోమెట్రిక్ వేయనివారి పేర్లు తగ్గి బియ్యం, ఇతర నిత్యవసరాలు తగ్గిస్తారనే భయంలో అనేక మంది స్మార్ట్‌కార్డులు తీసుకొనేందుకు ముందుకు రాలేదనే సమాచారం. స్మార్ట్‌కార్డుల పేరిట ప్రభుత్వం అనర్హులుగా గుర్తించి పెద్దఎత్తున తెల్లరేషన్‌కార్డుల తొలగించేందుకు కుట్ర చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. స్మార్ట్‌కార్డులు పొందని వారు స్థానికంగా లేరు, చనిపోయిన వారి పేర్లున్నాయనే సాకులతో స్మార్ట్‌కార్డులు పొందని వారి వివరాలను సేకరించి తొలగించేందుకు సిద్ధమవుతోంది దీంతో అల్పదాయ వర్గాల కోసం మంజురు చేసిన తెల్లకార్డులు తగ్గిపోనున్నాయి.

పన్నూరు పాఠశాలలో..

కనీస వసతులు కరువు..

- అపరిశుభ్రంగా వంటశాల
- క్లోరినేషన్‌కు నోచుకోని తాగునీటి ట్యాంకు
- తలుపులు లేని మరుగుదొడ్లు
- మూలకుచేరిన శుద్ధనీరు

ప్రజాశక్తి- విజయపురం

మండలంలోని పన్నూరు ఉన్నత పాఠశాల లోపల అడుగు వేస్తే సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఈ పాఠశాలలో మొత్తం 352మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతిఏటా మండలంలో 10వ తరగతి పరీక్షల్లో చాలా మంది విద్యార్థులు టాపర్స్‌గా నిలుస్తున్నారు. ఇటువంటి పాఠశాలలో కనీస వసతులు కరువై పారిశుధ్యం అధ్వానంగా ఉంది. తాగునీరు కొళాయి చుట్టూ పాటిపట్టి అపరిశుభ్రంగా ఉంది.

విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం తయారు చేసే భోజన శాల చుట్టుపక్కట పారిశుధ్యం అధ్వానంగా ఉంది. గది చుట్టూ మట్టి, దుమ్ము ధూళి దీనికి తోడు పక్కనే మురుగునీరు ప్రవహిస్తోంది. ఎక్కడా చూసినా చెత్తచెదారం దర్శనమిస్తున్నాయి. వంట గది ఉన్నప్పటికీ బహిరంగ ప్రదేశంలో వంట చేస్తున్నారు. తాగునీటి కొళాయి వద్ద నీరు ముందుకు కదలడం లేదు. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో అక్కడ మురుగు నిల్వ చేసి పాటిపట్టి ఉంది. అంతే కాకుండా తాగునీటి ట్యాంక్‌ను క్లోరినేషన్ చేయడం లేదని తెలిసింది.



తాగునీటి కొళాయి వద్ద అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు

మరుగుదొడ్డి అంతంత మాత్రమే..

పాఠశాలలో ఆవరణంలో కట్టిన మరుగుదొడ్డి పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లలకు ఇంత వరకు తలుపులు బిగించలేదు. ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్డి లోపల అడుగు వేస్తే ముక్కు ముసుకొని వెళ్లవల్సిన దుస్థితి నెలకొంది. మరుగుదొడ్లలను శుభ్రం చేసి ఎన్ని రోజులు అయ్యిందో తెలియని పరిస్థితి.

మూలకుచేరిన శుద్ధనీరు..

విద్యార్థులకు శుద్ధనీరు అందించాలని సుమారు రెండేళ్ల క్రితం వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయితే అది మరమ్మతుకు గురై మూలకు చేరి ఏడాదికిపైగా అయ్యింది. ఇంత వరకు వాటిని మరమ్మతు చేయించింది లేదు. దీంతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ట్యాంక్ ద్వారా నుంచి వచ్చే నీటినే తాగునీరుతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృభిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు అపరిశుభ్రమైన నీటి వలన రోగాల భారినపడే ప్రమాదం లేకపోలేదు. వెంటనే విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించాల్సి ఉంది.

నిధులు ఏమయ్యాయి..

పాఠశాలలో ఇన్ని సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించడానికి, మరమ్మతులకు, పాఠశాల అభివృద్ధి కోసం వచ్చే నిధులు ఏమైపోతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలలో ఎక్కడ చూచిన సమస్యలే కనిపిస్తున్నాయని, ప్రధానోపాధ్యాఉలు, ఉపాధ్యాయులు ఏమి చేస్తున్నారని అడుతున్నారు. అసలు ఉపాధ్యాయులు ఉన్నారా..లేదా అన్న సందేహం కలుగుతోందని, ఇప్పటికైన జిల్లాస్థాయి అధికారులు పన్నూరు పాఠశాల ఆవరణంలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం..
జానకిరామరెడ్డి, హెచ్‌ఎం, పన్నూరు జడ్పీహెచ్‌ఎస్

పాఠశాలలోని మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటుచేయడానికి, వంట చేసే స్థలంలో ఫ్లోరింగ్ ఏర్పాటుకు కూడా నిధులు మంజూరయ్యాయి. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. తలుపులు ఏర్పాటు చేయడం జరుగుతుంది. అలాగే ఫ్లోరింగ్ పనులు కూడా పూర్తిచేశ్తాం. పాఠశాల పరిసరాల్లోని సమస్యలన్నింటికీ పరిష్కరిస్తాం.

గ్రామాల అభివృద్ధికి కృషి: ఎమ్మెల్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- రామకుప్పం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం మండల కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ సులోచన గుర్రప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పది నెలల్లోనే పరిశ్రమలు ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 22 వేల ఉద్యోగాలు అందుతాయని అన్నారు. పి4 కింద బంగారు కుటుంబాలుగా మండలంలో 1764 పేద కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. త్వరలో మినీ ఏయిర్ స్ట్రిప్ శంకుస్థాపన చేసి సంవత్సరంలోపు నిర్మాణాలు చేపట్టనున్నారని, ప్రజలకు అందాల్సిన మౌలిక సదుపాయాలు శరవేగంగా జరిగేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతారామ్, తహశీల్దార్ కౌలేష్, ఎంపీడీవో లక్ష్మీకాంత్, వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడు, రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్ , సింగల్ విండో ఛైర్మన్ మహమ్మద్ రఫీ, ఏం సి డైరెక్టర్ మునేంద్ర నాయక్, ఎంపిటీసీలు, సర్పంచులు వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

స్పెషల్ ఆఫీసర్ చంద్ర



ప్రజాశక్తి- యాదమరి: పది పరీక్షల్లో 10వ తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించాలని జిసిడబ్ల్యూఎస్ స్పెషల్ ఆఫీసర్ చంద్ర పేర్కొన్నారు. గురువారం కొట్టాలం ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి 100 డేస్ ప్రోగ్రాంలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొటాలంను సందర్శించి పర్యవేక్షించారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పాస్ అవ్వాలని, పాఠశాలలో జరిగే ప్రత్యేక తరగతులకు అందరూ సమయానికి హాజరుకావాలని సూచించారు. ఆయన అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు చురుకుగా సమాధానాలు ఇవ్వడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో మంచి స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొటాలం నిలవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు యూసుఫ్, ఉపాధ్యాయులు వెంకటరమణ, అమరేంద్ర, ధనశేఖర్, రాణి, కలైవాని, లీలారాణి పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్



ప్రజాశక్తి- పలమనేరు: సుప్రీంకోర్టు తీర్పు మేరకు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం పలమనేరు పురపాలక సంఘం పరిధిలోని వీధి కుక్కల ఏబిసి, ఏఆర్‌వి నియంత్రణ చర్యలలో భాగంగా ప్రత్యేక డ్రైవ్‌ను గురువారం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి మాట్లాడుతూ పురపాలక సంఘపరిధిలో వీధి కుక్కల నియంత్రణ చర్యలలో భాగంగా వాటికి వాక్సినేషన్ చేయిస్తున్నామని, వారంలో 2 రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పట్టణంలోని వీధి కుక్కలను చిత్తూరు నగరపాలక సంస్థలో గల స్టెరిలైజేషణ్ సెంటర్‌లో వాక్సినేషన్ కొరకు పంపుతూ వాటి నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. పట్టణ ప్రజలంతా వీధికుక్కల బెడద నుండి విముక్తికి తగు చర్యలు తీసుకుంటున్నామని, రాబోవు రోజుల్లో వీధి కుక్కల సంఖ్య మరింత తగ్గించుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్, పారిశుధ్య కార్మికులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి నూతన చట్టం ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి- పలమనేరు (గంగవరం)

నిరుపేద కుటుంబాలు గడవడానికి ఊతమిస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే కుట్ర చేయొద్దని, చట్టాన్ని నిర్వీర్యం చేసి పేదల పొట్టకొట్టొద్దు అని గంగవరం మండలంలోని నాలుగు రోడ్ల కూడలిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హంగేరి ఓబుల్‌రాజు ఆధ్వర్యంలో నూతన చట్టం ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా యాన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ ర్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి రాం జి) పేరుతో ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీయం చేస్తున్నారని అన్నారు. కూలీలకు చట్టబద్ద హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను ఖండిస్తున్నామన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ ర్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి రాంజి) పేరుతో ఉపాధి హామీ పథకానికి రాంరాం పలకుందన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారన్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికులకు డిమాండ్ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చివేసి అవసరాన్ని (సప్లయిని) బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమే అన్నారు. గ్రామీణ కూలీలకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ పథకంలోని మహాత్మా గాంధీ పేరును తొలగించారు. పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకే అన్నారు. ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్తబిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని, మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచారన్నారని, మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ నూతన చట్టాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని, వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కార్మిక సంఘం నాయకులు గణేష్, సోము, శివా, బుజ్జమ్మ, జయంతి, నారాయణమ్మ, మురుగేష్, బాల వరదరాజులు పాల్గొన్నారు.


ఉపాధి చట్టం నూతన ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి


విజయపురంలో..

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : 5 సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ప్రత్యేక అధికారి సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి పల్స్ పోలియో అవగాహన సదస్సు నిర్వహించారు. పోలియో రహిత రాష్ట్ర లక్ష్యం కోసం ప్రజలు సహకరించాలన్నారు. విద్యా, వైద్యశాఖలు సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎంపీడీవో వాణి, ఎంఈవో శ్రీదేవి, వైద్యులు బిందు, ఎయిళరసన్, మోహనరూప, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పలమనేరు: ఈనెల 21న పల్స్ పోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి వైద్యులు డాక్టర్ జె.శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. ఒక్కో బూత్‌లో నలుగురు చొప్పున పిహెచ్‌సి పరిధిలోని 3543 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. 22, 23తేదీల్లో మిగిలిన పిల్లలకు ఇళ్ల వద్దకు వెళ్లి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని తెలిపారు. మండల విద్యాధికారి వేణుగోపాల్ రెడ్డి, శిశు సంక్షేమ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం పల్స్ పోలియో పోస్టర్లను వైద్యశాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 21న ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పోలియో రహిత సమాజానికి ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. వైద్యులు మల్లికార్జునరెడ్డి, హెల్త్ సూపర్వైజర్ జయశంకర్, ఏఎంసీ ఛైర్మన్ రాజన్న, మాజీ ఏఎంసి ఛైర్మన్ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.


పలమనేరులో..

పలమనే రూరల్ (గంగవరం): ఈనెల 21వ తేదీ ఆదివారం నిర్వహించనన్ను పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ మల్లికార్డున్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లుతో సమావేశం నిర్వహించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా 0 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు.

రోడ్డు లెవెలింగ్ లోపాలతో ప్రమాదాల ముప్పు

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి

బైరెడ్డిపల్లి నుంచి దాసర్లపల్లి వైపు బెంగళూరు-చెన్నై నేషనల్ హైవే మీదుగా నిర్మిస్తున్న డ్యాం రోడ్డు సరైన లెవెలింగ్ లేకుండా నిర్మించడంపై తీవ్రఅభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తీర్థం గ్రామ సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుకు అధిక మెట్టు ఏర్పడటంతో డ్యాం మీదుగా వెళ్లే వాహనాలకు ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే లోపాలను సవరించాలని కోరుతూ గురువారం డ్యాం వద్ద ఆటో యూనియన్ నాయకులు గోవింద్ స్వామి, శ్రీనివాస్ మూర్తి, రమేష్, విశ్వనాథ్ (సర్పంచ్), అమీర్ బాష,కాలీల్ రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఆర్ అండ్ బి, ఆర్‌ఎంబీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ధర్నా చేస్తున్న వారితో మాట్లాడారు. ఏఈ ఆదికేశవులు, చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే మేనేజర్ తివారి, సర్వేయర్ హేమంత్, సైడ్ ఇంజినీర్లు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆటో యూనియన్ నాయకులు కోరిన విధంగానే రోడ్డు లెవెలింగ్ సరిచేసి నిర్మాణ పనులు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని భరోసా ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే మళ్లీ చుట్టుపక్కల గ్రామాలప్రజలతో కలిసి ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.


రోడ్డు పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో

ప్రజాశక్తి- గుడుపల్లి: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యాక్రమాల అమలు, స్వామిత్వ , ఇంటింటి నుంచి చెత్త సేకరణ, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి సరఫరాపై జిల్లా పరిషత్ సీఈవో వి.రవికుమార్ నాయుడు సమీక్షించారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాయలంలో జిల్లా పంచాయతీ అధికారి కె.సుధాకర్ రావు ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, వీఆర్వోలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెడ్పీ సీఈవో మాట్లాడుతూ మండలంలో స్వామిత్వ కార్యక్రమం, ఇంటింటి నుండి చెత్త సేకరణ, వీధి దీపాల నిర్వహణ, పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి సరఫరా తదితర ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు ఎలా జరుగుతోందని ఆరా తీశారు. గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వకార్యక్రమాల అమలులో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, నిర్ణీత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సుబ్రమణి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి తొలగింపులు ప్రారంభం


కాకవేడు వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ముందస్తు నోటీసులు ఇచ్చిన విగ్రహాలు, ఆలయాలతో పాటు పలు కట్టడాల తొలగింపును గురువారం నుంచి పనులను అధికారులు ప్రారంభించారు. తహశీల్దార్ రవికుమార్, సీఐ మల్లికార్జున్, జాతీయ రహదారి అధికారులు పోలీసు బలగాలతో ఉదయం నుంచే తొలగింపులను ప్రారంభించారు. నేత్రదేవత ఆలయ ఆర్చి, కాకవేడు కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం, ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రహరీగోడ, వీకేఆర్ పురం వద్ద గల ఓంశక్తి ఆలయ ప్రహరీ, నత్తం కండ్రి వద్ద గల శక్తి ఆలయ ప్రహరీలు, బస్ షెల్టర్లను ప్రొక్లయిన్‌లు, ఇతాచీలు, క్రేన్‌ల సాయంతో తొలగించేశారు. కీళపట్టు వద్ద ఉన్న ఆంజేయస్వామి ఆలయ తొలగింపులో నిర్వాహకులు ఆలయంలోని వస్తువులు పూర్తి తీసుకోలేదని నాలుగు రోజులు సమయం ఇస్తే వస్తువులు తీసుకొని భారీ ఆంజనేయ స్వామి విగ్రహాన్ని అలాగే పెకలించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేసుకుంటామని తహశీల్దార్‌కు విన్నవించుకున్నారు. దీంతో వారికి నాలుగు రోజుల సమయంను అధికారులు కేటాయించారు. మిగిలిన నిర్మాణాల తొలగింపును జాతీయ రహదారి అధికారులు చకచకా కానిచ్చేశారు.

ఆర్‌జెడి ఆకస్మిక తనిఖీలు



ప్రజాశక్తి- యాదమరి: మండలంలోని కే.గొల్లపల్లి ఉన్నత పాఠశాలను ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జెడి) డి.శ్యాముల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల వందరోజుల కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులపై శ్రద్ధ పెట్టి చదివించాలన్నారు. ప్రతి విద్యార్థికి అన్ని సబ్జెక్టు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు లలిత, మండల విద్యాశాఖ అధికారి హెచ్.ఎల్.ఎస్.ప్రసాద్, ఎస్‌ఎస్‌ఎ సెక్టోరియల్ అధికారి మధు పాల్గొన్నారు. అలాగే భూమిరెడ్డిపల్లె స్వచ్ఛత ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు.

ఎస్టీల భూ ఆక్రమణల పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: గిరిజనులకు ప్రభుత్వం మంజూరు చేసిన భూములను అక్రమంగా స్వాధీనం చేసుకుంటున్న అగ్రవర్ణ కులాలవారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ ఎరుకల సేవ సంఘం రాష్ట్ర కార్యదర్శి బాబన్నగారి శివశంకర్ అన్నారు. మండలంలోని మొగిలి గ్రామంలో తురగల్లుటలో గిరిజన సంక్షేమ వసతి గృహానికి ఐదు ఎకరాలు గిరిజనులకు 20 గృహాలకు, శ్మశాన వాటికకు కేటాయించిన భూములను అగ్రవర్ణ కులాలవారు చదును చేయడం ఆక్రమించుకోవడం బాధాకరమన్నారు. గిరిజనుల భూముల జోలికి వచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని ఉద్యమం ద్వారా ప్రశ్నిస్తామన్నారు.

నేడు కుప్పంలో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం 132/ 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కుప్పం టౌన్, రూరల్, గుడుపల్లె మండలాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని శెస్కో డీఈ ప్రభాకర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విడతల వారీగా కుప్పం టౌన్, రూరల్, గుడిపల్లి మండలాల్లో పవర్ కట్ ఉంటుందని, వినియోగదారులు గమనించాలని వారు విజ్ఞప్తి చేశారు.

స్వామిత్వ కార్యక్రమాలపై సమీక్ష



ప్రజాశక్తి- శాంతిపురం: స్వామిత్వ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై జడ్పీ సీఈఓ రవికుమార్, డిపిఒ సుధాకర్ రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామకంఠ భూముల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులను గుర్తించి వారి వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యను పరిష్కరించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. ఇంటి పన్నును సుమారు 50 లక్షల రూపాయలు పెండింగ్‌లో ఉన్నదని వీటిని ఈనెల 31 లోపు వసూలు చేయాలని తెలిపారు. అలాగే ఇంటింటి చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రజలందరూ ప్రభుత్వం నిర్వహించే అభిప్రాయ సేకరణలో ప్రజలు వారి అభిప్రాయాన్ని సంతృప్తిగా నమోదు చేసే విధంగా చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎపిఆర్.కుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వర్ పాల్గొన్నారు.

పిపిపి విధానాన్ని ఉపసంహరించకపోతే

ప్రజలే గుణపాఠం చెబుతారు: సిపిఐ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మెడికల్ కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు చిత్తూరు అపోలో మెడికల్ కాలేజీ ముందు గురువారం సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గోపీనాథ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ మంగళగిరి పాదయాత్రలో నారాలోకేష్ తాము అధికారంలోకి వస్తే 107, 108 జీవోలను రద్దు చేసి తమ ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు అన్నింటిని నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తుంగలో తొక్కడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజారోగ్య రంగాన్ని పిపిపి పేరుతో ప్రైవేటుపరం చేయడం వల్ల ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆసుపత్రులు ప్రైవేటు వ్యక్తుల చేతులలోకి వెళ్లి నిరుపేదలకు మెరుగైన వైద్యం అందని తీరుగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. వైద్య విధానాన్ని ప్రైవేటీకరణ చేస్తే సమాన మధ్యతరగతి ప్రజలకు వైద్యం దూరమవుతుందని అన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా అంతటా విస్తృతంగా విద్యార్థులకు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులను పోలీసుశాఖ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆర్‌కె.విద్యాలయ జూనియర్ కళాశాలలో చిత్తూరు క్రైమ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మహిళలపై జరిగే నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని అన్నారు. మత్తు వల్ల వ్యక్తి భవిష్యత్తు నాశనం అవుతుందని, కుటుంబం కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు. యువత సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని, తెలిని లింకులు, అనుమానాస్పద సందేశాలకు స్పందించకూడదని సూచించారు.

సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

ప్రజాశక్తి- శాంతిపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే సంకల్పించిందని టీడీపీ అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఎస్ఆర్ పథకం కింద రాష్ట్రంలో 5000 బీసీ, ఎస్సీ, ఎస్టీ, కేజీబీవీ హాస్టల్స్ అభివృద్ధి చేస్తోందని, స్మార్ట్ కిచెన్, స్మార్ట్ హెల్త్, స్మార్ట్ డిజిటల్ విధానంతో విద్యార్థులకు రుచి, శుచికరమైన ఆహారం అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం' పథకంతో నాలుగు రకాల కూరలతో స్థానిక ఆహారం అందిస్తోందని, కేంద్ర సహకారంతో రూ.221 కోట్లతో 65 నూతన వసతి గృహాలను కూటమి ప్రభుత్వం నిర్మించబోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా హాస్టల్ మరమ్మతులకు గాను బడ్జెట్లో రూ.143కోట్లు కేటాయించారని, ప్రభుత్వం ఏర్పడి తొలి 15 నెలలోనే 535 హాస్టళ్ల అభివృద్ధి, పాత బకాయిలు మొత్తం కలిపి సుమారు రూ.178.5 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. విద్యావ్యవస్థలో వైసిపి చేసిన కుట్ర కదురుకు సమూల ప్రక్షాళన దిశగా కూటమి వేగంగా పరుగులు పెడుతోందని అన్నారు.

ద్విచక్ర వాహనం ఎక్కితే.. హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి- కుప్పం

ప్రతి ద్విచక్ర వాహనదారుడు వాహనం ఎక్కిన హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని, హెల్మెట్ వాడితేనే నిజమైన రోడ్డు భద్రత సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పం- పలమనేరు జాతీయ రహదారిపై రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత అన్నది ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని.. ప్రతి పౌరుడి బాధ్యతగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని, వేగ నియంత్రణ పాటించడం, వాటితో పాటు హెల్మెట్ వాడకం తప్పనిసరి పోలీసు సిబ్బంది అలవాటుగా చేసుకోవాలని ఎమ్మెల్సీ తెలిపారు. టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతరామ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: ద్విచక్ర వాహనం ఎక్కితే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పూతలపట్టు సిఐ గోపి తెలిపారు. గురువారం మండల పరిధిలోని గల్లా ఫ్రూట్స్‌లోని సిబ్బందికి హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు హెల్మెట్‌పై వారం రోజులపాటు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదం సంభవించినప్పుడు హెల్మెట్ ఉంటే కొంతవరకు ప్రాణాలు దక్కే అవకాశం ఉందని.. నేడు చాలామంది హెల్మెట్ ధరించకుండా రహదారులపై యథేచ్ఛగా తిరుగుతున్నారు. అలాంటి వారి పట్ల ఇకపై కఠినంగా వ్యవహరించిస్తామని ఆయన హెచ్చరించారు.



పూతలపట్టులో..



శాంతిపురంలో..

శాంతిపురం : మండలంలోని ఎంకే.పురం గ్రామంలో గురువారం రోడ్డు భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యతపై రాళ్ళబుదుగురు ఎస్ఐ నరేష్, పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. పిఎంకె ఉడా ఛైర్మన్ డాక్టర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వలన ప్రాణరక్షణ సాధ్యమని, రోడ్డు ప్రమాదాలు, సురక్షిత డ్రైవింగ్ విధానాలపై ప్రజలకు వివరించారు. మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేస్తూ ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. మండల టిడిపి అధ్యక్షుడు ఉదయ్ కుమార్, సింగల్ విండో అధ్యక్షుడు గోపాల్, గుంజర్లపల్లి సర్పంచ్ విజయ రామిరెడ్డి, నాయకులు విశ్వనాథ్ నాయుడు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

స్థానిక మండలం అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ సమక్షంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తారని మండల అభివృద్ధి అధికార మహేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలను ప్రజాప్రతినిధులకు విన్నవించుకోదలచిన వారు అర్జీలు, వినతలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి ప్రజాదర్బార్లో సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

సబ్‌స్టేషన్‌లో తనిఖీలు



సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఇస్మాయిల్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు సబ్‌స్టేషన్‌ను గురువారం సూపరింటెండెంట్ ఇస్మాయిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ సిబ్బంది పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో అన్ని సమస్యలు తర్వలోనే పరిష్కరిస్తామని, ఉపకేంద్రంలోని మరమ్మతులను చేయించడానికి కృషి చేస్తామనని హామీ ఇచ్చారు. అలాగే మండలంలోని పలు ఉపకేంద్రాలను, వెదురుకుప్పం హెడ్ క్వార్టర్స్‌లోని సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట డీఈ సురేష్‌బాబు, ఏఈ రియాజ్ అహ్మద్, లైన్‌మెన్ మల్లారెడ్డి, భార్గవ్, పాపిరెడ్డి, లోకనాథం ఉన్నారు.

నారాయణస్వామిపై

తప్పుడు ప్రచారం మానుకోవాలి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మాజీ డిప్యూటి సిఎం నారాయణస్వామిపై తప్పుడు ప్రచారం మానుకోవాలని వెదురుకుప్పం మండలం వైస్ ఎంపిపి జెగిని విజయ మునిక్రిష్ణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుటుంబానికి నారాయణస్వామి నమ్మిన బంటు అని ఎప్పటికీ జీడీ నెల్లూరు నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా నారాయణస్వామి కుటుంబానికి తప్ప వేరే వాళ్ళకు ఛాన్స్ లేదని అన్నారు. నియోజకవర్గంలో ఎవ్వరూ ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా 2029లో నియోజకవర్గం నుండి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా కృపాలక్ష్మి పోటీ చేసి భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని అన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: స్థానిక డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ తరపున స్పెషల్ క్యాంపును మండలంలోని పెరుమాళ్ళపల్లి గ్రామంలో బుధవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సి.మంగళ గౌరీ, గ్రామ సర్పంచ్ బి.శశి ఆనంద రెడ్డి పాల్గొన్నారు. గురువారం రెండోరోజు 47 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని గ్రామంలోని క్లీనర్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని విడతల వారిగా చేసి గ్రామాన్ని శుభ్రం చేశారు. పండ్లు, పూల మొక్కలను పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో నాటారు. ఎన్ఎస్ఎస్ కమిటీ మెంబర్లు డాక్టర్ డి.లావణ్య కుమారి, డాక్టర్ వి.నాగేశ్వరరావు, వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ మెప్మా ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో స్వయం సహాయక సంఘాల్లోని 539 మంది మహిళలకు ఉచితంగా 16 రకాలు వైద్యపరీక్షలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని ఏవీసీ కళ్యాణమండపంలో మెడికల్ క్యాంపు కమిషనర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల పైబడిన మహిళల్లో ఎంతోమందికి ఎన్నో రకాల తెలియని జబ్బులు ఉండే అవకాశం ఉందని, ముందుచూపు చర్యతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నయుడు ఉచితంగా సఖి సురక్ష కార్యక్రమం ద్వారా నిర్వహించడం జరిగిందన్నారు. కార్యమ్రకంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మోహిద్దీన్, మెప్మా మేనేజర్ బాబా, మెప్మా సిబ్బంది, డాక్టర్లు ఆయుష్, శ్రీరాములు, కౌన్సిలర్ బిఆర్సి కుమార్, రాష్ట్ర కురుబ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గౌడ్ పాల్గొన్నారు.

వాటర్ బాటిల్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి- కార్వేటి నగరం: కార్వేటినగరంలోని తూర్పు వీధిలో ఏర్పాటుచేసిన మన్షన్ హౌస్ వాటర్ బాటిల్ షాపును ప్రారంభోత్సవ కార్యక్రమానికి గంగాధర్ నెల్లూరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం. థామస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్దిదారులకు అందజేశారు. కార్వేటినగరం డీలర్ లోకనాథం, డిస్ట్రిబ్యూటర్ నరసింహనాయుడు, ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు చంగల్రాయ యాదవ్, ఎమ్మెల్యే సోదరులు రాజా, బిగల రమేష్ పాల్గొన్నారు.



పట్టు రైతులను ఆదుకోవడం అభినందనీయం..!



ప్రజాశక్తి- రామకుప్పం: పట్టు రైతులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటానికి పట్టు గూళ్ళతో మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో గురువారం కుప్పం ఏఎంసి ఛైర్మన్ జి.మునిరాజు ఆధ్వర్యంలో అభిషేకం చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, పిఎస్ మునిరత్నం, పికేఎం ఉడా ఛైర్మన్ సురేష్‌బాబు పాల్గొని మాట్లాడారు. రాయలసీమలోనే అత్యధికంగా పట్టుగుళ్ళు పండించే కుప్పం నియోజకవర్గంలోని పట్టు రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో వైసిపి ప్రభుత్వం పట్టు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు కోటి 74 లక్షల రూపాయలను విడుదల చేశారన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని వ్యవసాయ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి కుప్పాన్ని వ్యవసాయానికి ప్రయోగశాలుగా మారుస్తున్నారని పేర్కొన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా వ్యవసాయ రంగానికి నీరు అందించి ప్రతి రైతు పండించే పంట సస్యశ్యామలం కావాలన్నా సంకల్పంతో రైతును ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా పంటలు పండించాలని, ఇందుకోసం రైతులు ఆధునిక వ్యవసాయాన్ని అనుసరించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. టిటిడి బోర్డు మెంబర్ శాంతారామ్, ఎంపిపి సులోచన గుర్రప్ప, వెంకటరమణ, వెంకట్రామే గౌడు, ఆనంద్ రెడ్డి, చిన్ని కృష్ణ, కామరాజ్ నాయక్, రవిరెడ్డి, రఘు, మునీంద్ర నాయక్, నాగభూషణం, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లకు ఏజెంట్లను పెట్టుకోవాలి: తహశీల్దార్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రతి పోలింగ్ బూత్‌కి వేర్వేరు రాజకీయ పార్టీ నుంచి ఏజెంట్లను పెట్టుకోవాలని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో తహశీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఏజెంట్‌లను పెట్టుకునేవారి పేర్లు అధికారులకు నివేదిక రూపంలో అందజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణలో ఏదైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఆర్ పురం తహశీల్దార్ లోకనాథం పెళ్లై , వెదురుకుప్పం తహశీల్దార్ బాబు, ఎన్నికల డీటీ మహేశ్వరి, ఆర్ఐ నరసింహులు, పెనుమూరు సీనియర్ అసిస్టెంట్ గీతాంజలి, వివిధ పార్టీల నేతలు వెంకటేష్ రెడ్డి, హేమ శేఖర్‌రెడ్డి, లోకేష్, చెంగారెడ్డి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



ప్రజాశక్తి- పలమనేరు: పెన్షనర్ల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేయాలని పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రెవెన్యూ డివిజన్ అధికారిని భవానికి గురువారం వినతిపత్రం అందజేశారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ 2024 తదుపరి పదవీ విరమణ పొందిన వారికి ఇంతవరకు గ్రాట్యుటీ చెల్లంచలేదన్నారు. కరువు భత్యం బకాయిలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, అంతేకాక జూలై 2024 సంవత్సరం నుండి మూడు డీఏలు చెల్లించాల్సి ఉందన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ కార్డులు సక్రమంగా అమలు కాక తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గత ప్రభుత్వం 12వ పిఆర్సి కమిటీని నియమిస్తే దానిని ప్రస్తుత ప్రభుత్వం రద్దు, ఇంత వరకు నూతన కమిటీ నియమించలేదన్నారు. ఇప్పటికే 12వ పిఆర్సి గడువు రెండున్నర సంవత్సరాలు దాటిపోయిందన్నారు. వీటన్నింటిని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగభూషణం, గోవింద రెడ్డి, పుష్పరాజు, రామప్ప, తులసి రెడ్డి, చంద్రశేఖర్, పరుశురాం, విజయ్ కుమార్, రాజారెడ్డి పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం



ప్రజాశక్తి- కుప్పం: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కుప్పం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్‌టిఏ చిత్తూరు జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చందనం రామయ్య, రాష్ట్రకార్యదర్శి రాజేశ్వర్ కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కుప్పం మండల అధ్యక్షుడుగా పన్నూరువారి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డేగ మోహన్, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రవీంద్రబాబు నాయుడు, జిల్లా కార్యదర్శిగా రామచంద్రయ్య, కుప్పం డివిజనల్ కన్వీనర్‌గా కావలి శ్రీరాములు ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భాస్కర్, అనిత, వైస్ ప్రెసిడెంట్‌గా రమేష్ బాబు, జగదీష్, జాయింట్ సెక్రటరీలుగా కిషోర్, అశోక్ కుమార్, ఫైనాన్స్ సెక్రటరీగా హరీష్ కుమార్, కిరణ్ కుమార్, కమిటీ మెంబర్‌గా హరీష్ కుమార్, వెంకట రమణమ్మ, శ్రీధర్ ఎన్నికయ్యారు.

వినియోగదారుడే సంస్థకు మొదటి పౌరుడు

ప్రజాశక్తి- విజయపురం (నగరి): వినియోగదారుడే మన సంస్థకు మొదటి పౌరుడని, వారిని అభిమానించడం మన కర్తవ్య ధర్మమని విద్యుత్ శాఖ సీజీఎం మురళి అన్నారు. సీఎండీ లోహిత్ శివకుమార్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్‌వీజీ కళ్యాణ మంపడంలో వినియోగదారులతో తొలి పలకరింత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజనీర్లు, అధికారులు, ఉద్యోగులు, బిల్ కలెక్టర్‌లతో మాట్లాడుతూ వినియోగదారులు సమస్యలపై ఫోన్‌చేస్తే తొలి పలకరింత 'నమస్తే ఏపీ ఎస్పీడీసీఎల్ సార్', నమస్తే ఏపీఎస్పీడీసీఎల్ మేడమ్' అని సంబోధించాలని ఆదేశించారు. ఈ తొలి పలకరింత ఎస్ఈ నుంచి షిఫ్ట్ ఆపరేటర్ వరకు పాటించాలని సూచించారు.



వినియోగదారులు తెలిపే సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలన్నారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడం ప్రతిఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో జిఎం క్రిష్ణారెడ్డి, ఎస్ఈ ఇస్మాయిల్, ఈఈ సురేష్‌కుమార్, నగరి డీఈఈ ప్రభాకర్, ఎఈలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రైలు కిందపడి యువకుడు మృతి

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలోని మోడల్ కాలనీ డంపింగ్ యార్డ్ సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 25 సంవత్సరాలు వయసు కలిగిన యువకుడు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 90007 16436 నెంబర్ను సంప్రదించాలని వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి..

మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- పూతలపట్టు: మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఈచర్ (మినీ లారీ)ఢీకొన్న ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ గోపి వివరాల మేరకు.. మండలంలోని ఒక ప్రైవేటు కర్మాగరంలో పనిచేస్తున్న ముగ్గురు మహిళలు గురువారం ఉదయం పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై కర్మాగారం నుంచి వారి సొంత గ్రామమైన పెనుమూరు మండలానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం సంభవించింది. ఇందులో గాయత్రి (23) అక్కడికక్కడే మృతి చెందగా జ్యోతి, మౌనిక తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాటరీ టికెట్ల విక్రయదారులు అరెస్టు



పోలీసుల అదుపులో లాటరీ విక్రయదారులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పట్టణంలో అక్రమంగా లాటరీ టికెట్లు విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు చిత్తూరు టౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్స్పెక్టర్ నెట్టి కంటయ్య తెలిపారు. గురువారం ఇన్స్పెక్టర్, ఏఎస్ఐ, కానిస్టేబుల్ బాబు. సిబ్బంది కలసి చిత్తూరు పట్టణంలోని జానకారపల్లి వద్ద లాటరీ టికెట్ విక్రయిస్తున్న వ్యక్తుల గురించి నందకుమార్, సెంథిల్ కుమరన్, అన్సర్ లతీఫ్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.25,200ల లాటరీ టికెట్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. పట్టుబడిన వారు రాష్ట్రంలో నిషేధించిన లాటరీ టికెట్లను చిత్తూరు పరిసర ప్రాంతాలలో అవసరమైన వారికి ఎక్కువ రేట్లకు అమ్ముతూ డబ్బులు సంపాదిస్తున్నట్లు, వీరు నలుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. లాటరీ టికెట్స్ కొని మీ డబ్బులు నష్టపోవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.

పేకాట శిబిరంపై దాడి.. ఇద్దరు అరెస్ట్



ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండలం తలుపులపల్లి సమీపంలోని వడ్డిపల్లి గ్రామం వద్ద పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో బంగారుపాళ్యం చెందిన మొగిలయ్య, పీలేరుకు చెందిన బాబును అదుపులోకి తీసుకున్నట్టు సీఐ గోపి తెలిపారు. నిందితుల వివరాలు మేరకు పేకాట ఆడుతూ పరారైన మరో ఆరుగురు పై కూడా కేసు నమోదు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

సీసీ కెమెరాలు చోరీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి గ్రామంలోని లక్కీ వైన్స్ షాపులో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను గుర్తు తెలియని దుండగులు బుధవారం అర్ధరాత్రి దొంగిలించారు. షాపులో అమర్చిన సీసీ కెమెరాలతో పాటు క్యాష్ కౌంటర్‌లో ఉన్న నగదును దుండగులు ఎత్తుకెళ్లినట్లు షాపు యజమాని జై కుమర్ గౌడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం వచ్చి షాపు వద్ద చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించామని తెలిపారు. రూ.10వేలు నగదుతోపాటు రూ.50వేలు విలువజేసే సిసి కెమెరాలు చోరీ జరిగినట్లు పోలీసులకు తెలిపారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ చందనప్రియ పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుకాణం గ్రామానికి దూరంగా ఉండటాన్ని అవకాశంగా తీసుకున్న దుండగులు ఈ చోరీకి పాల్పడ్డారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గోపాలమిత్ర మృతి

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని టీకేఎంపురం గ్రామానికి చెందిన గోపాలమిత్ర రవి (56) మృతి చెందాడు. గురువారం స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. పాడి రైతులకు ఆయన చేసిన సేవ మరువలేనిదని గ్రామస్తులు కొనియాడారు. పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతునికి భార్యా పిల్లలు ఉన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుంద్రం పంచాయతీ మాజీ సర్పంచ్ పిల్లారి కుప్పం గ్రామానికి చెందిన దొరస్వామి మందడి (79) గురువారం ఉదయం మరణించారు. గత కొద్దిరోజులుగా వేలూరు నర్వి హాస్పిటల్‌లో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. పరిస్థితి మరింత క్షీణించడంతో గురువారం ఆయన మరణించారు.

భూమిని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు

ప్రజాశక్తి - రొంపిచెర్ల : తమ భూమి ఆక్రమిస్తున్నారని బాధితులు లేట్ రామస్వామి భార్య వి.కుమారి, వెంకటరమణ భార్య చెల్లెమ్మ రొంపిచెర్ల పోలీసులకు, రెవెన్యూ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. మండలంలోని చిచ్చిలివారిపల్లి గ్రామపంచాయతీ, ముంతావారిపల్లెకు చెందిన వెంకటయ్య పేరుతో సర్వే నెంబరు 2973-3 లో 1.90 సెంట్లు టికెట్ ఇవ్వమని పట్టా ఇచ్చారని ఆ భూమిని రామస్వామి, వెంకటరమణ పేర్లతో ఒకరికి 95సెంట్లు చొప్పున మార్పు చేయడం జరిగిందని, ఆన్‌లైన్‌లో భూమి తమ పేర్లతోనే ఉందన్నారు. వారి బతుకుదెరువు కోసం రొంపిచెర్లలో గుడ్డలు ఉతికి ఐరన్ చేసుకుని జీవనం సాగిస్తున్నామని, అయితే గ్రామానికి చెందిన నాగార్జున నాయుడు, సావిత్రమ్మ దౌర్జన్యంతో తమ భూమిని ఆక్రమించుకుంటున్నారని జేసీబీ సహాయంతో భూమిని చదును చేస్తున్నారని వాపోయారు. తాము ఊర్లో లేని సమయం చూసి తమ భూమిలో ఉలవపంట సాగు చేశారని ఇదేమని అడిగితే మీకు దిక్కున్న చోట చెప్పుకోమని దౌర్జన్యంగా దాడులకు పాల్పడుతున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులను ఆశ్రయించినట్లు తెలిపారు.